క్లుప్తంగా

పరామర్శ



హనుమంత రాజు మృతదేహానికి నివాళులర్పిస్తున్న సమన్వయకర్త ఈరలక్కప్ప

అమరాపురం: వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ సోదరుడు హనుమంత రాజు (50) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మడకశిర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప శనివారం అమరాపురంలోని త్రిలోక్‌నాథ్ స్వగృహానికి వెళ్లారు. హనుమంతరాజు మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పారు. అలాగే మడకశిర నియోజకవర్గ ఎస్సీ, బీసీ సెల్ అధ్యక్షులు శివన్న, శివకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు జేకే.మూర్తి, శివకుమార్, బీడీ మూర్తి, నాగభూషణ నాగరాజు, తదితరులు హనుమంతరాజు మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పొగాకు వాడకం ప్రాణాంతకం



పొగాకు నియంత్రణపై ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, ఆరోగ్య సిబ్బంది

హిందూపురం టౌన్: పొగాకు ప్రాణాంతకమని ప్రభుత్వ ఆస్పత్రి దంతవైద్య నిపుణులు డాక్టర్ భూపాలం విజయ్‌బాబు, డాక్టర్ సురేఖదేవీ తెలిపారు. శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా డాక్టర్ విజయ్ బాబు ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రి నుంచి అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు ఏటా 7 మిలియన్లకు పైగా మరణాలకు కారణమవుతోందన్నారు. దాన్ని వాడడం అంటే మరణానికి దగ్గరవ్వడమే అని వైద్యాధికారిణి డాక్టర్ జయం పద్మజ తెలిపారు. పొగాకు ద్వారా గుండె, ఊపిరితిత్తుల సమస్యలు, క్యాన్సర్ వ్యాధులకు గురయ్యే విధానాలను ఫిజీషియన్ డాక్టర్ జక్కా నరేంద్ర తెలిపారు. ఇండియన్ డెంటిస్ట్ అసోసియేషన్ తరపున డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ నవీన్ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులకు అడ్డుకట్ట వేయకపోతే భవిష్యత్తులో యువత ఆరోగ్యానికి పెనుప్రమాదం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు చరణ్, మోహన్‌బాబు, అపర్ణ, రమ్య, భరత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక మట్టి రోడ్డు నిర్మాణం



రోడ్డుపై మట్టిని తోలి జేసీబీతో చదును చేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

రొళ్ల: మల్లినమడుగు పంచాయతీ కేంద్రంలో హెచ్‌టీ హళ్లి–సీసీ గిరి గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డులో డ్రైనేజీ వ్యవస్థ లేని కారణంగా చిన్నపాటి వర్షానికే నీరు నిలవడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడేది. శనివారం సాక్షి పత్రికల్లో 'రోడ్డుపై వరినాట్లు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించారు. బురదమయమైన ప్రధాన రహదారిపై మట్టిని తోలి జేసీబీతో చదును చేయించారు. రోడ్డుకు ఇరువైపుల డ్రైనేజీ నిర్మాణం చేపడితే సమస్య తీరుతుందని గ్రామస్తులు, ప్రయాణికులు చెబుతున్నారు.

షెడ్ల తొలగింపును అడ్డుకున్న దుకాణదారులు



దుకాణదారులు, మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న సీఐ రాజగోపాల్‌నాయుడు

హిందూపురం: మున్సిపల్ అధికారులు నానెప్పనగర్ సాయిబాబా ఆలయం వద్ద రోడ్డు పక్కనున్న షెడ్లను తొలగించడానికి ప్రయత్నించడంతో దుకాణదారులు అడ్డుకున్నారు. సాయిబాబా ఆలయం వద్ద ఓ ప్రైవేట్ వ్యక్తి, ఏళ్లుగా అక్కడ ఉంటున్న వారికి మధ్య స్థల వివాదం కోర్టులో ఉంది. ఈ నేపథ్యంలో మున్సిపల్ అధికారులు వంద అడుగుల రోడ్డు విస్తరణ కోసమని రోడ్డు పక్కనున్న దుకాణాలను తొలగించేందుకు జేసీబీతో వచ్చారు. దీంతో దుకాణదారులు మున్సిపల్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, బాషా, రామ్మూర్తిలు తదితరులు దుకాణదారులకు మద్దతుగా నిలిచారు. విషయం తెలుసుకున్న సీఐ రాజగోపాల్‌నాయుడు అక్కడికి చేరుకుని మున్సిపల్ అధికారులతో చర్చించారు. స్థలం దేవదాయ శాఖ పరిధిలోకి వస్తుందని చెబుతున్నారని మున్సిపల్, దేవదాయశాఖ చర్చించి నిర్ణయం తీసుకుని బాధితులను సమయం ఇచ్చి తొలగింపులు చేయాలని సీఐ నచ్చజెప్పడంతో మున్సిపల్ సిబ్బంది వెనుదిరిగారు.



ఇస్లాపురం గ్రామంలోకి వెళ్లే తారు రోడ్డు దుస్థితి



అధ్వానంగా ఉన్న కోనాపురం వెళ్లే ప్రధాన రహదారి

పేరుకే నగర పంచాయతీ..

అభివృద్ధి నాస్తి



ఇస్లాపురంలో పురాతన కాలం నాటి రాళ్ల దారి

- అభివృద్ధికి ఆమడదూరంలో పెనుకొండ నగర పంచాయతీ
- అవస్థలు పడుతున్న స్థానిక ప్రజలు
- రోడ్ల రూపురేఖలు ఎక్కడ మార్చారని నిట్టూర్పు

పెనుకొండ: పేరుకే నగర పంచాయతీ.. అభివృద్ధి జరిగిందిలేదు.. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయినా కనీసం కాలనీల్లోని రోడ్లు బాగు చేసిన దాఖలాలు లేవు. సార్వత్రిక ఎన్నికల సమయంలో నగరాలకు తీసిపోని విధంగా నగర పంచాయతీలను అభివృద్ధి చేస్తామని హామీలిచ్చి..ఇంత వరకూ పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు అంటున్నారు. ఇంటి గుత్తలు, కొళాయి గుత్తలు, ఇంటి అనుమతులకు పన్ను తడిసి మోపెడవుతున్నా రోడ్ల రూపు రేఖలు మాత్రం మారకపోవడం బాధాకరమని నిట్టూరుస్తున్నారు. పట్టణంలోని ఎన్‌టీఆర్ కాలనీ, జగనన్న కాలనీ, శ్రీరాములయ్య కాలనీ, మారుతీనగర్, న్యూకాలనీ, జర్నలిస్ట్ కాలనీ, దర్గాపేటలోని పలు ప్రాంతాలతో పాటు కోనాపురం రహదారి అధ్వానంగా ఉన్నాయి. పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని ఇస్లాపురం గ్రామంలో రోడ్లు మరీ అధ్వానంగా ఉన్నాయి. తిమ్మాపురం ఇందిరమ్మ కాలనీలోనూ రోడ్లు మరీ దారుణంగా ఉన్నాయి. పట్టణానికి ఆనుకొని ఉన్న నగర పంచాయతీ పరిధిలోని ఇస్లాపురం గ్రామంలో గ్రామంలో 600 కుటుంబాలు, 2,600 మంది జనాభా నివసిస్తున్నారు. రోడ్లు నిర్మాణానికి నోచుకోలేదు. గ్రామంలో మట్టి రోడ్లు, రాళ్లు తేలి ప్రజలు నడవలేని పరిస్థితి. ద్విచక్రవాహనాలు, కార్లు వెళ్లాలన్నా ఇబ్బందే. వీధుల గుండా మురుగునీరు పారుతూ అపరిశుభ్రంగా ఉన్నాయి. పురాతన రాళ్ల రోడ్డు ఇప్పటికీ ఉంది.

ఆదాయం అంతంత మాత్రమే..

పెనుకొండ నగర పంచాయతీ పరిధిలో ఆదాయం అంతంతమాత్రమే. కనీసం రోడ్ల నిర్మాణానికి నగర పంచాయతీ నిధులు రాకపోవడంతో రోడ్ల నిర్మాణానికి అవరోధంగా ఉంది. ప్రభుత్వ నిధుల నుంచి వచ్చే గ్రాంట్లు ఏవీ నగర పంచాయతీ అభివృద్ధికి వినియోగించే పరిస్థితిలేదు.

అధ్వానంగా ఉన్నాయి



పేరుకే నగర పంచాయతీ. వీధుల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. నగర పంచాయతీకి ఆనుకొని ఉన్నా అభివృద్ధి మాత్రం కనిపించదు. పన్నులు అన్నీ కట్టించుకుంటున్నా రోడ్లు మాత్రం నిర్మించరు. అధికారులు ఎక్కడ రోడ్లు అధ్వానంగా ఉన్నాయో గుర్తించి నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలి.

– ఆంజనేయులు, ఇస్లాపురం, పెనుకొండ నగర పంచాయతీ

ఇబ్బందులు తప్పడం లేదు



పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోకి ఇస్లాపురం గ్రామాన్ని చేర్చారు. కనీసం అభివృద్ధి జరగలేదు. గ్రామంలో రోడ్లు ఏ మాత్రం మారలేదు. గ్రామంలో తిరిగి చూస్తే రోడ్ల పరిస్థితి తెలుస్తుంది. ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రోజు ఈ రోడ్లపై నడవాలంటే నరక యాతన తప్పడంలేదు.

– ఆదిలక్ష్మమ్మ, ఇస్లాపురం, పెనుకొండ నగర పంచాయతీ

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త ఈరలక్కప్ప

అగళి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ జూన్ 4వ తేదీన నియోజకవర్గ స్థాయిలో వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద నాయకులతో కలసి వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ బోజేగౌడ్, జనరల్ సెక్రటరీలు శ్రీనివాసులు, నాగేంద్ర మంజునాథ, సెక్రటరీలు చంద్రన్న, గంగన్న, ఈశ్వరప్ప, మెంబర్లు నాగరాజు, సందన ఆరాధ్య, మారన్న, రామచంద్రప్ప, నారాయణప్ప, సర్పంచులు శివకుమార్, ముద్దరాజు, రామకృష్ణప్ప, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు జయరామప్ప, సోషల్ మీడియా కన్వీనర్ నారాయణ, నాయకులు కృష్ణ, తిమ్మరాయప్ప గిరిష్, నవీన్ ,తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్‌లో వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప విడుదల చేశారు. 4వ తేదీన మడకశిరలో చేపట్టనున్న వెన్నుపోటు దినోత్సవానికి నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసింహారెడ్డి, తాలూకా జేసీఎస్ బూత్ ఇన్‌చార్జ్ నాగేంద్ర, వైఎస్ కన్వీనర్ నగేష్‌గౌడ, మండల వైఎస్సార్‌సీపీ కార్యదర్శులు జయప్ప, శివన్న, ఈసీ మెంబర్లు ప్రసన్నకుమార్, రఘువీర్, సంతోష్, వైస్ సర్పంచ్ రవి, నాయకులు దయానంద్, మహంతేష్, యరగుంటప్ప, మల్లప్ప, పుట్టప్ప, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి



పౌరహక్కులపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ మారుతీ ప్రసాద్

గోరంట్ల: మండల పరిధిలోని కొండాపురం ఎస్సీ కాలనీలో తహసీల్దార్ మారుతీ ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీకాలనీ వాసులకు భారత రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పౌర హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేంద్ర, ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసనాయక్, డీవిజన్ కమిటీ సభ్యులు గంగాధర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పరిగి: ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన అవసరమని తహసీల్దారు హసీనా సుల్తానా తెలిపారు. శనివారం మండలంలోని ఊటుకూరు ఎస్సీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు విధులను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం దళితులపై దాడులు చేసినట్లు రుజువైతే శిక్షార్హులవుతారన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రంగడుయాదవ్, జెడ్పీటీసీ శ్రీరామప్ప, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రామాంజినప్ప, ఆర్‌ఐ సిద్దేశ్వర్ పాల్గొన్నారు.

హిందూపురం: మణేసముద్రం గ్రామంలో శనివారం పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా అధికారులు హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు. డిప్యూటీ తహసీల్దార్ మైనుద్దీన్ మాట్లాడుతూ సమస్యలు ఏవైనా అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. ఏఎస్‌ఐ జయరాం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లేపాక్షి: బిసలమానేపల్లి పంచాయతీలోని రాజీవ్ కాలనీలో శనివారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. తహసీల్దార్ సౌజన్యలక్ష్మి మాట్లాడుతూ పౌర హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ , పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అమరాపురం: మండల పరిధిలోని ఆరోనపల్లిలో శనివారం ఎస్‌ఐ ఇషాక్ బాషా, సీనియర్ అసిస్టెంట్ రజిత, ఆధ్వర్యంలో పౌర హక్కులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో ప్రజలు శాంతియుతంగా అన్నదమ్ముల్లా మెలగాలన్నారు. తగదాలకు దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా పౌరులు తమ హక్కులతో పాటు బాధ్యతలను గుర్తించుకోవాలని సూచించారు. సమాజంలో అందరూ సమానమేనన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. పిల్లలను విద్యావంతులను చేయడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రామంజనేయులు, సర్పంచ్ భాగ్యమ్మ, పాల్గొన్నారు.

చట్టాలను గౌరవించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న స్వామి జపానంద

పావగడ: చట్టాలను గౌరవించడంతో పాటు చట్టాలకు అనుగుణంగా నడుచుకోవాలని స్థానిక రామకృష్ణ సేవాశ్రమాధిపతి స్వామి జపానంద తెలిపారు. శనివారం స్వామి వివేకానంద సంఘటిత గ్రామీణ ఆరోగ్య కేంద్రం ఆడిటోరియంలో న్యాయవాదుల సంఘం, తాలూకా న్యాయ సేవా సమితి, రామకృష్ణ సేవాశ్రమం సంయుక్తంగా అంతర్జాతీయ కార్మిక, పొగాకు నిరోధక దినోత్సవాలను పురస్కరించుకుని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ.. చదువుతోపాటు సామాజిక సేవా దృక్పథం అలవరచుకోవాలని నేటి యువతకు సూచించారు. స్థానిక జేఎంఎఫ్‌సీ సీనియర్ సివిల్ న్యాయమూర్తి వి.మాదేశ్ మాట్లాడుతూ.. పొగాకు ఉత్పత్తుల వినియోగం ఆరోగ్యానికి హానికరమన్నారు. పొగాకు సేవనంతో నోటి క్యాన్సర్ తదితర ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమం కోసం అనేక చట్టాలున్నాయని.. వాటిని సద్వినియోగం చేసుకునేలా కార్మిక సంఘాలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన సివిల్ న్యాయమూర్తి బి.ప్రియాంక, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హెచ్.శేషానందన్, కార్యదర్శి ప్రభాకరరెడ్డి, ఏపీపీ సణ్ణీరప్ప తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉచిత సామూహిక వివాహాలు



కల్యాణ మండపం ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు

రొద్దం: మండల పరిధిలోని ఎల్‌జీబీనగర్ సమీపంలోని సాయిగీతా కన్వెన్షన్ హాల్ ప్రారంభోత్సవం సందర్భంగా శనివారం ఉచిత సామూహిక వివాహాలు ఘనంగా జరిగాయి. పెనుకొండ ఎంపీపీ గీతా రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సామూహిక వివాహాలకు ఎమ్మెల్సీ సానిపల్లి మంగమ్మ, మాజీ మంత్రి శంకరనారాయణ, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యేలు అబ్దుల్ ఘని, విశ్వేశ్వరరెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఉదయం 12 గంటలకు ఎంపీపీ గీతా రామ్మోహన్‌రెడ్డి దంపతులు 5 జంటలకు నూతన వస్త్రాలు, మంగళ సూత్రాలు అందజేశారు. పురోహితుల సమక్షంలో వివాహాలు జరిపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు గంగుల భానుమతి, ఎర్రిస్వామిరెడ్డి, మహాలక్ష్మీ శ్రీనివాస్, స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఎయిడ్స్‌పై అవగాహన

గుడిబండ: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం సంస్థ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో అనిల్‌కుమార్ కళా బృందం వారు వీధి నాటకం ద్వారా హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు సౌందర్య, చిదానంద్, సీహెచ్‌ఓ కృష్ణవేణి, ఎంపీహెచ్‌ఈఓ ఖాదర్‌వలీ, ఎంపీహెచ్‌ఎస్‌ఎఫ్ శ్రీలక్ష్మి, ఏఎన్‌ఎంలు పద్మ, భ్రమరాంబిక, లక్ష్మీరంగమ్మ, ఎల్‌టీ జనార్దన్, జోనల్ సూపర్‌వైజర్ వెంకట్, లింక్ వర్కర్లు సరితమ్మ, గౌరమ్మ, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి వీడ్కోలు

రొళ్ల: కాకి ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఆర్‌ఎస్‌ఎల్‌ఎన్ మూర్తి శనివారం ఉద్యోగ విరమణ చేశారు. పాఠశాల ఆవరణలో ఆర్‌ఎస్‌ఎల్‌ఎన్ మూర్తి దంపతులను పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్‌ప్రసాద్, హెచ్‌ఎం దాసేగౌడు, ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యంజారప్ప, ఉపాధ్యాయులు షబ్బీర్, వినోద్, కమలమ్మ, రామకృష్ణారెడ్డి, మూడ్లగిరియప్ప తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

మడకశిర: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో శనివారం నియోజకవర్గంలోని 15 మంది లబ్ధిదారులకు దాదాపు రూ.9.68 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులకు సన్మానం

మడకశిర: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న డ్రైవర్ శ్రీరాములు, కండక్టర్ లక్ష్మీదేవి, ఆర్టీసీ అధికారి సంజీవప్ప శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా వీరిని పూలమాలలతో సన్మానించారు. ఏరియా ఆస్పత్రిలో ఆర్‌ఎంఓగా విధులు నిర్వహిస్తున్న దివాకర్ ఉద్యోగ విరమణ చేయడంతో ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బంది సన్మానించారు.

కారు బోల్తా : ముగ్గురికి గాయాలు

హిందూపురం: కారు బోల్తాపడిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాలు.. శనివారం ఉదయం హిందూపురం నుంచి బెంగళూరుకు వెళ్తున్న కారు బసవనపల్లి వద్ద అదుపుతప్పి రోడ్డుపక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో విద్యుత్ స్తంభం విరిగి కారుపై పడింది. అటుగా వెళ్తున్న వారు కారులో ఉన్న వారిని బయటకు తీశారు. ఘటనలో కారు డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. గాయపడిన వారు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొంది వెళ్లినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

సచివాలయం-3 కిటికి అద్దాలు ధ్వంసం

రొద్దం: మండల కేంద్రంలోని హౌసింగ్ కాలనీ వద్ద నిర్మించిన సచివాలయం-3 కిటికీ అద్దాలను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. రాత్రి వేళ బండరాళ్లతో కొట్టి గ్లాస్ అద్దాలు ధ్వంసం చేశారు. రాత్రి వేళ కొందరు తాగుబోతులు సచివాలయం వద్ద రోజూ మద్యం చేస్తున్నట్లు గ్రామస్తులు చెప్తున్నారు. మద్యం చేవించడానికి వచ్చే వ్యక్తులే కిటికి అద్దాలు పగలకొట్టి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ఉల్లాసం

అమరాపురం: గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఆధ్యాత్మిక చింతనను అలవరచుకోవడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని తుమకూరు జిల్లా సిద్దరబెట్ట మఠాధిపతి రేణుకాచార్య స్వామిజీ అన్నారు. శనివారం స్థానిక వీరశైవ లింగాయతుల ఆరాధ్య దైవం బసవేశ్వరస్వామి ఆలయ ఆవరణలో సమావేశం నిర్వహించారు. ప్రజలు నిత్యం ఓ చోట చేరి ఆధ్యాత్మిక కార్యక్రమాలు, పుస్తకాలు చదవడం, పెద్ద పెద్ద వారి జీవిత చరిత్రలు వినిపించటం, కథలు తదితర వాటితో పాటు పూజ కార్యక్రమాలు చేయాలన్నారు. జూన్ 8న సిద్దరబెట్ట మఠంలో నిర్వహించే బసవేశ్వర జయంతి, రేణుకాచార్య స్వామిజీ జన్మదినోత్సవానికి మండలం నుంచి అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. అనంతరం స్వామిజీని స్థానిక వీరశైవ లింగాయతులు పాదపూజ నిర్వహించి శాలువా పూలమాలలతో సన్మానం చేశారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

లేపాక్షి: అంతర్జాతీయ యోగా దినోత్సవంలో అందరూ భాగం కావాలని, యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యమని తహసిల్దార్ సౌజన్యలక్ష్మి పేర్కొన్నారు. శనివారం ఉదయం లేపాక్షిలోని చారిత్రాత్మక ప్రదేశమైన వీరభద్రస్వామి ఆలయ ఆవరణలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతు యోగా చేయడం వలన మానసిక ఒత్తిడిని తొలగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో యోగా ఉపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి, అధికారులు, యోగాభ్యాసకులు పాల్గొన్నారు.

యోగాపై అవగాహన

మడకశిర: పట్టణంలోని ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం యోగాపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యోగా గురువు శ్రీనివాసులు విద్యార్థులకు వివిధ యోగాసనాలు నేర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపల్ హేమలత, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ అనిల్‌కుమార్, అధ్యాపకులు నాగసాయి ప్రసాద్, నాగరాజు, క్రిష్ణప్ప, వినోదమ్మ, చంద్రశేఖర్ నాయక్, శ్రీరామిరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై చర్చ

పావగడ: స్థానిక ఎమ్మెల్యే, తుముల్ అధ్యక్షుడు హెచ్‌వి వెంకటేశ్ మేఘాలయ పర్యటన కొనసాగుతోంది. పర్యటనలో భాగంగా ఆ రాష్ట్ర రాజధాని షిల్లాంగ్‌లో శనివారం వివిధ ప్రాంతాలను వీక్షించారు. ముఖ్యంగా కర్ణాటక రాష్ట్రం వెనుకబడిన వర్గాలు, మైనారిటీల సంక్షేమ సమితి సభ్యులు, అదే విధంగా మేఘాలయ బీసీ వర్గాలు, మైనారిటీ సంక్షేమ సమితి సభ్యులు మేఘాలయ విధాన సభలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మేఘాలయ ప్రభుత్వం బీసీ, మైనారిటీల వర్గాలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై చర్చించారు. అనంతరం మైసూరు చెందిన మేఘాలయ గవర్నర్ సీహెచ్ విజయశంకర్‌తో భేటీ ఆయ్యారు. గవర్నర్ నివాసంలో ఏర్పాటు చేసిన విందులో వెంకటేశ్‌తో పాటు కర్ణాటక అధికారులు పాల్గొని ఆతిథ్యాన్ని స్వీకరించారు.

పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి సవిత

పెనుకొండ: పట్టణంలోని న్యూకాలనీలో రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖామాత్యులు సవిత పింఛన్లను శనివారం పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పింఛన్ మొత్తాన్ని అవసరాలకు వాడుకోవాలన్నారు.

రొళ్ల: మండల పరిధిలోని గుడ్డగుర్కి పంచాయతీ పరిధిలోని గొట్టుగుర్కి, దాసప్పపాళ్యం తదితర గ్రామాల్లో శనివారం సామాజిక భద్రత ఫింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, వక్కలిగ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ పాండురంగప్ప, కన్వీనర్ దాసిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ గురుమూర్తి పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణానికి స్థల పరిశీలన

పరిగి: మండలంలోని శీగిపల్లిలో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ నిర్మాణానికి అధికారులు స్థలాన్ని శనివారం పరిశీలించారు. తహసీల్దారు హసీనా సుల్తానాతో కలిసి బీఎస్ఎన్ఎల్ డివిజనల్ ఇంజనీరు రిజ్వాన్‌బాషా గ్రామ శివారులోని ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సిద్దేశ్వర్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కూలీలకు గాయాలు

పావగడ: పట్టణంలోని తేజస్ హోటల్ సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజవంతి గ్రామానికి చెందిన 14 మంది మహిళా కూలీలు గాయాలపాలయ్యారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అనంతరం శనివారం డిశ్చార్జ్ అయ్యారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు.. తాలూకాలోని నీలమ్మనహళ్లికి వేరుశనగ పంట కలుపును తొలగించడానికి కూలీలు ఆటోలో వెళ్లారు. పనుల అనంతరం తిరిగి స్వగ్రామం రాజవంతికి ఆటోలో వస్తుండగా.. ఎదురుగా వస్తున్న కారు ఆటోను ఢీకొట్టింది. స్థానిక పీయూ కళాశాల లెక్చరర్ విశ్వనాథ్, రాజవంతికి చెందిన మంజునాథ్ తదితరులు బాధితులను సకాలంలో ఆస్పత్రికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ సురేశ్ వెల్లడించారు.

నేడు వెన్నుపోటు దినం పోస్టర్ల విడుదల

పరిగి: మండలం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ ఆదివారం పర్యటించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ నరసింహమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తయినా ప్రజల సంక్షేమాన్ని, రాష్ట్రాభివృద్ధిని పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ ఈనెల 4న «వెన్నుపోటు దినం» నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక బీరప్ప ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం 1:30 గంటలకు పార్టీ కార్యకర్తలతో కలిసి వెన్నుపోటు దినం పోస్టర్లను ఉషశ్రీ చరణ్ విడుదల చేయనున్నారన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

నేడు జిల్లా అధ్యక్షురాలు, పార్లమెంట్ ఇన్‌చార్జ్ రాక

మడకశిరరూరల్: మడకశిరకు ఆదివారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, హిందూపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ రమేష్‌రెడ్డి వస్తారని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు మడకశిర పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో జూన్ 4న చేపట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేస్తారని పేర్కొన్నారు. జిల్లా, రాష్ట్ర, నియోజకవర్గ కమిటీల సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

వాహనదారుడిపై ఆవు దాడి



వాహనదారుడిపై దాడి చేస్తున్న ఆవు

చిలమత్తూరు: హిందూపురంలో వాహనదారుడిపై ఆవు దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు..హిందూపురం గాంధీ చౌక్‌లో మూడు రోజుల క్రితం వాహనదారుడిపై ఆవు దాడి చేయడంతో అతడు కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు అతడిని బెంగళూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే ఆవు వాహనదారుడి దాడి చేస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పట్టణంలో తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నా పోలీసులు, మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉద్యోగికి సన్మానం

చిలమత్తూరు: ఎంపీడీఓ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న నారాయణ శనివారం ఉద్యోగ విరమణ చేయడంతో కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు నారాయణ సేవలను కొనియాడారు.